సాక్షి
ఖమ్మం
శనివారం ¦ 14 ¦ జనవరి ¦ 2023

ఖమ్మంకు 'వందేభారత్'



సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వరకు నడిపించనున్న వందే భారత్ ప్రత్యేక రైలును ఈనెల 15న ఆదివారం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అదేరోజు రైలు ఖమ్మం స్టేషన్‌కు మధ్యాహ్నం 1–30 గంటలకు చేరుకుంటుంది. అంతే కాక ప్రజల సందర్శనార్థం మధిర, కొండపల్లి స్టేషన్లలో కూడా రైలు ఆపనున్నారు. ఇక 16వ తేదీ నుండి విజయవాడ నుంచి వెళ్తున్నప్పుడు ఉదయం 11గంటలకు, సికింద్రాబాద్ నుంచి వెళ్తున్నప్పుడు సాయంత్రం 5–45 గంటలకు ఖమ్మం స్టేషన్‌కు వస్తుందని అధికారులు వెల్లడించారు. – ఖమ్మం మామిళ్లగూడెం

న్యూస్‌రీల్

నర్సింగ్ అభ్యర్థులకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు

నేలకొండపల్లి: నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన వారికి విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరాం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కంటి వెలుగు కేంద్రాలను గురువారం పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్ కామ్) యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఉద్యోగ సమాచారం తెలుసుకోవచ్చని చెప్పారు. ఇదేక్రమంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని వచ్చే దళారులను నమ్మొద్దని సూచించారు. జపాన్, బ్రిటన్, కెనడాలో నర్సింగ్ అభ్యర్థులకు మంచి అవకాశాలు ఉన్నందున, జిల్లా నుంచి 150 మందితో పరీక్ష రాయించినట్లు తెలిపారు. రూ.1.10 లక్షలు చెల్లిస్తే విదేశాల్లో ఉద్యోగ నైపుణ్యాల కోసం ఆరు నెలలు పాటు శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. ఆతర్వాత ఏటా రూ.14 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు ప్యాకేజీలో ఉద్యోగావకాశాలు ఉంటాయని శ్రీరాం వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 18,200 మంది నిరుద్యోగులు ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.జమలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ కేంద్రం ఏర్పాటుపై పరిశీలన



క్రీడాకారులతో శాయ్ పరిశీలకులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ఆధ్వర్యాన ఆర్చరీ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నందున శాయ్ పరిశీలకులు సుబ్బారావు పరిశీలించారు. స్టేడియంలో సదుపాయాలు, క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకున్న వసతులను ఆరా తీశాక, సంతృప్తి వ్యక్తం చేశారు. డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, అథ్లెటిక్స్, ఆర్చరీ కోచ్‌లు ఎం.డీ.గౌస్, పాయం నగేష్‌తో పాటు ప్రశాంత్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో నాణ్యమైన సేవలు



సమీక్షలో మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ సంధ్యారాణి

ఖమ్మంగాంధీచౌక్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలందించాలని జిల్లా సంక్షేమాధికారి సీహెచ్.సంధ్యారాణి సూచించారు. ఖమ్మంలో శుక్రవారం సీడీపీఓలు, ఏసీడీపీఓలు, సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్ సిబ్బందితో సమావేశమైన ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత, అదనపు ఆహారం, బలహీన నవజాత శిశువు సంరక్షణపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, సాంకేతికత పరిజ్ఞానాన్ని పెంచుకుని అంగన్‌వాడీ కేంద్రాల్లో పారదర్శకమైన సేవలందించాలని చెప్పారు. పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త పోనుగంటి సంపత్, సీడీపీఓలు బాలత్రిపురసుందరి, కవిత, దయామణి, సరస్వతి, కొండమ్మ, కృష్ణకుమారి, శారద, శాంతి తదితరులు పాల్గొన్నారు.

యాసిడ్ దాడులకు పాల్పడితే కఠినచర్యలు



జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఖమ్మంలీగల్: వివిధ కారణాల వల్ల మహిళలపై యాసిడ్ దాడులు జరుగుతున్నాయని.. ఇలాంటి కేసుల్లో బాధితులకు చట్టం అండగా నిలవడమే కాక నేరస్తులను కఠినంగా శిక్షిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. న్యాయసేవా సదన్‌లో 'ఆమ్లదాడి బాధితులకు న్యాయసాయం' అంశంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కక్షలు, కార్పణ్యాలతో రగిలిపోకుండా క్షమాగుణం అలవర్చుకోవాలని సూచించారు. న్యాయసేవాసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్‌పాషా మాట్లాడగా న్యాయమూర్తులు ఎస్.అమరావతి, ఎన్.శాంతిసోని, పి.మౌనిక, ఆర్.శాంతిలత, నాజర్, కె.రాధేశ్యాం, సాంకేతికాధికారి ఎస్.ఓంకార్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సమకాలీన పరిస్థితులలో నేరాలు, వివక్ష నుంచి తప్పించుకోవడానికి బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా సూచించారు. స్థానిక బాలల సదన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని బాలికలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. బాలల సద నం సూపరింటెండెంట్ బి.వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సభాస్థలిలో చదును చేస్తున్న దోజర్లు



వడివడిగా అడుగులు..

జోరందుకున్న సభ ఏర్పాట్లు

- చురుగ్గా సాగుతున్న వేదిక, ఇతర పనులు
- ఒకేరోజు మూడు నియోజకవర్గాల్లో మంత్రి హరీశ్ పర్యటన
- జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా నేతలతో భేటీ
- సభ విజయవంతంపై దిశానిర్దేశం



సభాస్థలిలో వేదిక నిర్మాణానికి తీసుకొచ్చిన సామగ్రి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లా కేంద్రంలో ఈనెల 18న జరగనున్న బీఆర్‌ఎస్ సభ ఏర్పాట్లు జోరందుకున్నాయి. నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించనున్న సీఎం కేసీఆర్.. మరో మూడు రాష్ట్రాల సీఎంలు, వివిధ పార్టీల అగ్రనేతలతో కలిసి కలెక్టరేట్ సమీపానే నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొననున్నారు. సమయం సమీపిస్తుండడంతో సభాస్థలంలో చదును చేయించే పనులు చివరి దశకు చేరగా, వేదిక నిర్మాణం ఇతర పనులు కూడా శుక్రవారం మొదలయ్యాయి. మరోపక్క సభ విజయవంతం కోసం జన సమీకరణపై నేతలు దృష్టి సారించారు. ప్రతీ నియోజకవర్గంలోని పట్టణ, మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటుచేస్తూ వాహనాల ఏర్పాటు, జన సమీకరణపై కేడర్‌కు సూచనలు ఇస్తున్నారు. ఇలా శుక్రవారం ఒక్కరోజే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి పాలేరు, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లో పర్యటించడమేకాక జిల్లా కేంద్రంలో ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలతో భేటీ అయి దిశానిర్దేశం చేశారు.

ఉమ్మడి జిల్లా నేతలతో సమీక్ష

ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులతో ఖమ్మంలో శుక్రవారం సభ సక్సెస్, జన సమీకరణపై కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని కీలక సూచనలు చేశారు. ఏ నియోజకవర్గం నుంచి ఎందరు వస్తారు.. ఎన్ని వాహనాలు అవసరముంటుందనే అంశాలపై చర్చించారు.

'తుమ్మల'కు బాధ్యతలు

కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మళ్లీ ఫామ్‌లోకి వచ్చినట్లు ఆయన అనుచరగణంలో చర్చ సాగుతోంది. కొత్తగూడెంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనకు తుమ్మల హాజరుకావడమే కాక ఆయన వెంటే కనిపించారు. అంతకుముందు రోజు మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు దమ్మపేట మండలం గండుగులపల్లిలోని తుమ్మల ఇంటికి వెళ్లిన విషయం విదితమే. ఆ తర్వాత ఆయన కొత్తగూడెంలో కేసీఆర్ కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే, సత్తుపల్లిలో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి మంత్రి హరీశ్‌రావుతోపాటు తుమ్మల హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ తుమ్మల కూడా శనివారం నుంచి ఖమ్మంలో ఉంటారని.., బీఆర్‌ఎస్ సభ విజయవంతం కావడానికి వారి సీనియారిటీ, సేవలు కావాలంటూ ఆయనపై బాధ్యతలు పెడుతూ మాట్లాడారు. జిల్లా అంతా దశదిశా వారే చేయాలంటూ ఆయన చెప్పారు.

సభ ప్రాధాన్యత చెబుతూ..

ఈనెల 18న నిర్వహిస్తున్న సభకు ఎంతటి ప్రాధాన్యత ఉందో ముఖ్యనేతలు సన్నాహక సమావేశాల్లో వివరిస్తున్నారు. సీఎం కేసీఆర్‌తోపాటు మూడు రాష్ట్రాల సీఎంలు, మరో రాష్ట్రానికి చెందిన మాజీ సీఎం, కమ్యూనిస్టు పార్టీ జాతీయ నేతలు వస్తుండటంతో అదే స్థాయిలో సభ సక్సెస్ కావాలంటూ క్షేత్ర స్థాయి కేడర్ భుజస్కంధాలపై బాధ్యతలు మోపారు. దేశం మొత్తం ఈ సభ వైపే చూస్తోందని, సభ సక్సెస్‌తో దేశ రాజకీయాలు మలుపు తిరుగుతాయంటూ కేడర్‌లో నూతనోత్సాహం నింపుతున్నారు. ఈ సభకు సీపీఎం, సీపీఐ అగ్రనేతలు కూడా వస్తున్నందున, ఉమ్మడి జిల్లా స్థాయిలో వారి కేడర్ వస్తే తీసుకురావాలని సూచనలు చేశారు. ఈ పార్టీలకు చెందిన ఖమ్మం నేతలు కూడా తనను కలిశారని మంత్రి హరీశ్‌రావు సత్తుపల్లి వేదికగా చెప్పారు.

ముందే సంక్రాంతి సందడి !

సత్తుపల్లిలో వేడుకలు

సత్తుపల్లిలో ముందుగానే సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. బీఆర్‌ఎస్ సభ సన్నాహక సమావేశం శుక్రవారం జరగగా, వేదిక పక్కనే ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆధ్వర్యాన సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. బోగిమంటలు వేయడమే కాక సంక్రాంతి పొంగళ్లు, రంగురంగుల ముగ్గులు, గంగిరెద్దుల ఆటలు ఏర్పాటుచేయగా... సీఎం కేసీఆర్ చిత్రపటాలతో ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈమేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు బోగి మంట వెలిగించి సంబరాలను ప్రారంభించారు. ఎంపీలు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, నామ నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి తదితరులు హాజరయ్యారు. – సత్తుపల్లి



సంక్రాంతి సంబరాల్లో మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎమ్మెల్యే సండ్ర, ఎంపీలు





హరిదాసు వేషధారణలోని చిన్నారికి ధాన్యం సమర్పిస్తున్న దృశ్యం

సంబురాల సంక్రాంతి

- పల్లెలకు నూతన శోభ
- ఇంటి ముంగిళ్లలో రంగవల్లులు
- మొదలైన డూడూ బసవన్నల సందడి

నేడు భోగభాగ్యాల భోగి

ఖమ్మంగాంధీచౌక్: కొత్త ధాన్యం ఇంటికి చేరుతున్న వేళ.. అందమైన ముగ్గులు, బొమ్మల కొలువులు, గొబ్బెమ్మలతో జిల్లా అంతటా సంక్రాంతి సందడి నెలకొంది. డూడూ బసవన్నలు, హరిదాసులతో ఊరు, వాడ సంబురాలు జరగనున్నాయి. పిండి వంటల తయారీలో మహిళలు, గాలిపటాలు ఎగురవేయడంతో చిన్నారులు బిజీగా గడుపుతుండగా... ఇతరప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార నిమిత్తం స్థిరపడిన వారు శనివారం భోగి జరుపుకునేందుకు స్వస్థలాలకు చేరడంతో పల్లెపట్నం పండుగ కళ సంతరించుకుంది.

మూడు రోజుల పండుగ

మూడు రోజులు ఆనందంగా జరుపుకునే పండుగ సంక్రాంతి. మొదటి రోజైన శనివారం భోగి, ఆదివారం మకర సంక్రాంతి, మూడోరోజు సోమవారం కనుమ పండుగగా జరుపుకుంటారు. ఇంకొన్ని ప్రాంతాల్లో నాలుగో రోజు ముక్కనుమగా జరుపుకుంటారు. మొదటిరోజైన శనివారం భోగిమంటలతో ఊరువాడ సందడి గడుపుతారు.

నేడు భోగి..

సంక్రాంతి పండుగ భోగితో ప్రారంభమవుతుంది. భోగి అంటే భోగభాగ్యాలు అనుభవించే రోజుగా జరుపుకోవటం ఆనవాయితీ. పాతకు స్వస్తి చెప్పి నూతనత్వానికి స్వాగతం పలికేందుకు ప్రతీ ఇంటి ఎదుట భోగి మంటలు వేసేందుకు సన్నద్ధమయ్యారు. బద్ధకం, అశ్రద్ధ, చెడు తలంపులను ఈ భోగి మంటలలో వేసి సంతోషం, ఆప్యాయతలతో కూడుకున్న జీవితాన్ని ప్రారంభించుకోవడం ఈ పండుగ పరమార్థం. ఇక ఇదేరోజు పిల్లలకు భోగి పండ్లు పోయటం ఆనవాయితీగా వస్తోంది.

జిల్లా అంతటా సందడి

పెద్ద పండుగగా పిలుచుకునే సంక్రాంతికి ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా స్వస్థలాలకు చేరుకున్నారు. దీంతో వచ్చివెళ్లే వారిలో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు రద్దీగా కనిపించాయి. అలాగే, పిండి వంటలు చేయడంలో మహిళలు బిజీబిజీగా గడిపారు. అలాగే, విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో చిన్నారులు గాలిపటాలు ఎగురవేశారు. ఇంకా ఇళ్ల ముందు ముగ్గు వేసేందు రంగులు, పూజద్రవ్యాల అమ్మకాలతో వ్యాపార కూడళ్లు కిక్కిరిసిపోయాయి.



డూడూ బసవన్నల ఆటలు

ఎక్కడా తగ్గొద్దు..

- చరిత్రలో నిలిచిపోయేలా ఖమ్మం సభ
- ఉమ్మడి జిల్లా నుంచి 3 లక్షల మందిని తరలిద్దాం
- మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన మంత్రి పువ్వాడ, ఎంపీలు, ఎమ్మెల్యేలు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలో ఈనెల 18న జరగనున్న భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) తొలి సభ యావత్ దేశం దృష్టిని ఆకర్షించి, చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేయాలని సభ ఇన్‌చార్జ్ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ మాట్లాడుతూ బహిరంగ సభను విజయవంతం చేసే విషయంలో ఎక్కడా తగ్గొద్దని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలతోపాటు పొరుగునే ఉన్న సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లోని పది నియోజకవర్గాలు కలిపి మొత్తంగా 20 నియోజకవర్గాల నుంచి ఐదు లక్షల మందిని సభకు తరలించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుండే మూడు లక్షల మందిని సమీకరించాలని చెప్పారు.

వ్యూహాత్మకంగా జనసమీకరణ

బీఆర్‌ఎస్ ఆవిర్భావం తర్వాత తొలి సభ ఖమ్మంలో జరగడం అదృష్టంగా భావించి, అందుకు తగినట్లుగా వంద ఎకరాల్లో జరగనున్న సభను భారీ జన సమీకరణతో విజయవంతం చేసేలా మంత్రులు పలు సూచనలు చేశారు. ప్రజాప్రతినిధులు వ్యూహాత్మకంగా జన సమీకరణపై దృష్టి సారించాలని తెలిపారు. ఇందులో భాగంగా వాహనాల సేకరణ, రూట్ మ్యాప్, పార్కింగ్ తదితర అంశాలపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.

సభ ద్వారా బీఆర్‌ఎస్ అజెండాపై స్పష్టత

ఖమ్మం సభ ద్వారా దేశ రైతాంగం, ప్రజలు, రాజకీయ వర్గాలకు బీఆర్‌ఎస్ అజెండాపై పూర్తి స్పష్టత ఇవ్వనుందని మంత్రులు హరీశ్, పువ్వాడ చెప్పారు. సభకు ముగ్గురు ముఖ్యమంత్రులు, జాతీయ స్థాయి నేతలను ఆహ్వానిస్తున్న నేపథ్యాన బీఆర్‌ఎస్ సభను పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని అన్నారు. జాతీయ రాజకీయాల్లో అరంగేట్రం తర్వాత తొలి సభ కావడంతో విజయవంతం చేయడాన్ని అందరూ బాధ్యతగా భావించాలని సూచించారు. ఇంకా ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నూకల నరేష్ రెడ్డి, రైతుబంధు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వరరెడ్డి, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, రాములునాయక్, వనమా వెంకటేశ్వరరావు, బానోతు హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, కౌశిక్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమ జోహరా, సుడా చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు కావలెను!

బీఆర్‌ఎస్ సభకు జనాన్ని తరలించేందుకు కసరత్తు

- ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, ట్రాలీలు, ఇతర వాహనాలు కూడా బుక్
- ఏపీలోని డిపోల నుంచి బస్సుల కోసం అన్వేషణ
- సంక్రాంతి, శబరిమల యాత్ర నేపథ్యంలో వాహనాల కొరత
- ఏ వాహనం ఉన్నా తరలిరావాలని నేతల పిలుపు

> ఖమ్మంలో ఈనెల 18న జరిగే బీఆర్‌ఎస్ బహిరంగ సభకు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు వచ్చేందుకు బస్సులు కావాలంటే దొరకవ్. లారీలో.. డీసీఎంలో ఏది దొరికితే దాంట్లో పోవాలె'..
>
> – సత్తుపల్లి సన్నాహక సమావేశంలో మంత్రి హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: టీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్‌గా అవతరించాక తొలిసారి ఈనెల 18న ఖమ్మంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సభకు జన సమీకరణపై పార్టీ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా పార్టీ శ్రేణులు, ప్రజలను తరలించేందుకు గాను బస్సుల కోసం అన్వేషిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని డిపోల నుంచి ఆర్టీసీ బస్సులేకాక ప్రైవేట్ బస్సులు, ట్రాలీలను ఇప్పటికే బుక్ చేసుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని పలు డిపోల నుంచి బస్సులను అద్దెకు తీసుకునేందుకు తెలంగాణ ఆర్టీసీ ఎండీని ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ అధికారులతో మాట్లాడాలని పురమాయించినట్లు తెలిసింది. సంక్రాంతి ప్రత్యేక బస్సులు నడిపిస్తుండడం, శబరిమలకు భక్తులు వెళ్లడంతో కొంత తక్కువగానే బస్సులు అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ వాహనాల కొరతను అధిగమించి జనాలను సభకు తరలించే యత్నాల్లో పార్టీ బాధ్యులు తలమునకలయ్యారు.

జన సమీక'రణ'మే..

బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభ ఖమ్మంలో భారీ స్థాయిలో నిర్వహిస్తుండడం, నలుగురు ముఖ్యమంత్రులు హాజరుకానుండడంతో సభ జాతీయ స్థాయిలో ఉత్కంఠ రేపుతుండగా, విజయవంతంపై పార్టీ దృష్టి సారించింది. సభ ఏర్పాట్లే కాకుండా భారీ ఎత్తున జన సమీకరణకు ప్రణాళికలు రచించింది. ఈ సభకు ఐదు లక్షల మందిని తరలించాలని నేతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ నుంచి ప్రజలను తరలించేలా నేతలకు బాధ్యతలు అప్పగించి నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

వాహనాల కోసమే..

ప్రజల తరలింపు కోసం బీఆర్‌ఎస్ శ్రేణులు ఇప్పటికే ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాలను బుక్ చేశాయి. అయితే మరిన్ని వాహనాల కోసం అన్వేషణ సాగుతోంది. సభ రోజు ఎన్ని వాహనాలు కావాలి.. ఎక్కడెక్కడి నుంచి తీసుకోవాలనే అంశంపై బాధ్యులు అంచనాలు వేస్తున్నారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపోల్లో 509 బస్సులు ఉండగా... వీటిలో వీలైనంత మేర ఆవిర్భావ సభకు వినియోగించుకునే యత్నాలు జరుగుతున్నాయి. కాగా, ఖమ్మం డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు ఖమ్మం డిపో నుంచి 125, మధిర నుంచి 20, సత్తుపల్లి నుంచి 30 బస్సులు కావాలని ఆర్టీసీ అధికారులను బీఆర్‌ఎస్ బాధ్యులు కోరినట్లు తెలిసింది.

ఆంధ్రా నుంచీ ప్రయత్నం

తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ నుంచి బస్సులు రప్పించేందుకు యత్నాలు సాగుతున్నాయి. ఖమ్మం సరిహద్దున ఉన్న ఏపీలోని నూజివీడు, తిరువూరు, జంగారెడ్డిగూడెం, విజయవాడ డిపోల నుంచి బస్సులు అద్దెకు తీసుకోవాలని భావిస్తున్నా ఇంకా ఓ కొలిక్కి రాలేదని సమాచారం. దీంతో ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ అధికారులతో మాట్లాడాలని తెలంగాణ ఆర్టీసీ ఎండీని కోరినట్లు తెలిసింది. ఈ చర్చలు ఫలిస్తే మరిన్ని బస్సులు సభకు జనాన్ని తరలించేందుకు అందుబాటులో రానున్నాయి.

బస్సుల కొరతతో..

ప్రైవేట్ వాహనాలతోపాటు ఆర్టీసీ బస్సుల కొరత కారణంగా బీఆర్‌ఎస్ నేతలు అన్నిచోట్ల వాహనాల కోసం ఆరా తీస్తున్నారు. సభకు కొద్దిరోజుల ముందే తేదీ ఖరారు చేయడం... ఈ సమయంలోనే సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడిపిస్తుండడం, అయ్యప్ప మాలధారులు శబరిమల వెళ్లిన నేపథ్యాన వాహనాలు తక్కువగా అందుబాటులో ఉన్నాయి. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు వాహనాల కోసం అన్వేషిస్తూనే లారీలు, ఇతర ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ఏవి పెట్టినా కేడర్ సభకు తరలిరావాలని సన్నాహక సమావేశాల్లో పిలుపునిస్తున్నారు.



ఖమ్మం రీజియన్‌లో డిపోల వారీగా ఆర్టీసీ, అద్దె బస్సులు

డిపో	ఆర్టీసీ	అద్దె
ఖమ్మం	67	71
మధిర	37	25
సత్తుపల్లి	44	49
మణుగూరు	28	34
భద్రాచలం	53	33
కొత్తగూడెం	33	35
మొత్తం	262	247

ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ వాహనాలు

స్కూల్ బస్సులు	915
ప్రైవేట్ బస్సులు	310
ఇతర వాహనాలు	18,000

క్లుప్తంగా

తెల్లం వెంకట్రావుకు మంత్రి పువ్వాడ పరామర్శ



వెంకట్రావును పరామర్శిస్తున్న మంత్రి

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ నాయకుడు తెల్లం వెంకట్రావును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరామర్శించారు. గుండె సంబంధిత చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆయన్ను మంత్రి శుక్రవారం పరామర్శించాక, చికిత్సపై వైద్యులతో మాట్లాడారు. భద్రాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చి ప్రారంభం



చర్చిని ప్రారంభిస్తున్న బిషప్ ఉడుముల బాల

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి 15వ వార్డు దిద్దుపూడిలో నిర్మించిన ఆర్‌సీఎం(నిత్య సహాయ మాత) చర్చిని ఖమ్మం పరిపాలనాధికారి బిషప్ ఉడుముల బాల శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక దివ్య బలి పూజ సమర్పించారు. దిద్దుపూడితో పాటు చుట్టుపక్కల గ్రామాలు, వైరా మున్సిపాలిటీ పరిధిలోని క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్లు తప్పెట శౌరి, జ్యాన్నేసు, ఫ్రాన్సిస్, గోవా శౌరి, ఆంథోని, ప్రదీప్‌రెడ్డి, లాజర్ శౌరి, జోజప్ప, రూబెన్ రాజు, సుందర్, సురేష్, జయరాజు, బాలస్వామి, జోసెఫ్, వార్డు కౌన్సిలర్ గుడిపూడి సురేష్ పాల్గొన్నారు.

వైద్యుడిని తొలగిస్తూ ఉత్తర్వులు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం వికటించి మహిళ మృతిచెందగా.. బాధ్యుడైన ఈఎన్‌టీ వైద్యుడు బాబూజాన్‌పై కలెక్టర్ వీ.పీ.గౌతమ్ చర్యలు తీసుకున్నారు. ఘటనపై వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ గురువారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో విచారణ చేపట్టి వైద్యుడి నిర్లక్ష్యమే మహిళ మృతికి కారణమని గుర్తించారు. ఈమేరకు ఆయనను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించగా, కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

కంటి వెలుగును విజయవంతం చేయండి

టెలీకాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



బడ్జెట్‌పై సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం: కంటి వెలుగు నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుండి శుక్రవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో కంటి వెలుగుపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన బృందాలను సన్నద్ధం చేయడమే కాక అదనంగా బఫర్ బృందాలను నియమించాలని సూచించారు. శిబిరాలపై విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటుచేసిన బృందాలు, శిబిరాలు, యంత్రాల వివరాలను వెల్లడించారు. ఈనెల 18న సీఎం కేసీఆర్ కంటి వెలుగును ఖమ్మంలోనే ప్రారంభించనున్నందున మోడల్ శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఇంటింటికీ ఆహ్వానం

నేలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 18నుంచి చేపడుతున్న కంటి వెలుగు శిబిరాలకు ప్రజలు హాజరయ్యే ఇంటింటికీ ఆహ్వాన పత్రం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలకు ఇప్పటికే ఆహ్వాన పత్రాలు చేరగా... శిబిరాల సమాచారాన్ని తెలియజేస్తూ ఇంటింటికీ వెళ్లి ఇస్తున్నారు. అలాగే, శిబిరానికి వచ్చేటప్పుడు ఆధార్, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల్లో ఏదైనా ఒకటి తెచ్చుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. కాగా, 16వ తేదీలోపు ఆహ్వానపత్రాలు ఇంటింటికీ ఇవ్వాలని అధికారులు ఆదేశించారు.



ఆహ్వానపత్రం అందజేస్తున్న సిబ్బంది

వనరుల ఆధారంగా ప్రణాళికలు

ఖమ్మంసహకారనగర్/రఘునాథపాలెం: మున్సిపాలిటీల్లో ఆదాయ వనరుల ఆధారంగా బడ్జెట్ రూపొందించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో శుక్రవారం ఆయన జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లతో బడ్జెట్‌పై సమీక్షించారు. ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిచ్చేలా పనులు చేపట్టేందుకు బడ్జెట్ రూపకల్పన చేయాలన్నారు. అలాగే, గత బడ్జెట్‌లో రూపొందించిన పనులు, చేసిన ఖర్చు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటూ, పన్నుల వసూళ్లు వంద శాతం జరిగేలా కార్యాచరణ చేయాలని ఆదేశించారు. ఈసమావేశాల్లో సమావేశంలో అదనపు కలెక్టర్ స్నేహలత, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీఎంహెచ్‌ఓ మాలతి, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్లు అనిత, రమాదేవి, సుజాత, ఆర్డీఓలు రవీంద్రనాథ్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 96660 13544

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

అటు పర్యవేక్షణ.. ఇటు పాలన



ఫైల్‌పై సంతకం చేస్తున్న కలెక్టర్ గౌతమ్

రఘునాథపాలెం : కొత్త కలెక్టరేట్‌ను ఈనెల 18న ప్రారంభించనున్నారు. దీంతో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ శుక్రవారం ఉదయమే చేరుకుని ఏర్పాట్లపై ఉద్యోగులకు సూచనలు ఇస్తూ రోజంతా గడిపారు. ఈక్రమంలోనే రోజువారీ ఫైళ్లను ఉద్యోగులకు అక్కడకే తీసుకురాగా పరిశీలించి సంతకాలు చేశారు. అలాగే, జిల్లాలో మున్సిపాలిటీల కమిషనర్లతో బడ్జెట్‌పై కొత్త కలెక్టరేట్‌లోనే సమీక్షించడం విశేషం.

రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్, తదితరులు

బోనకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 67వ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు పోటీలు జరగనున్న పోటీలను జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ప్రారంభించారు. రాష్ట్రంలోని పాత పది జిల్లాల నుంచి బాలబాలికల జట్లు హాజరయ్యాయని, ఇక్కడ ప్రతిభ కనబరిచే వారితో జాతీయ స్థాయి పోటీలకు జట్లను ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. అనంతనం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ శాంతిస్నేహ యూత్ ఆధ్వర్యాన ముప్పై ఏళ్లుగా బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ ఇస్తున్న అమిరేసి లింగయ్య అభినందనీయులన్నారు. బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, ఎంపీడీఓ వేణుమాధవ్, వైస్ ఎంపీపీ గుగులోత్ రమేష్‌తోపాటు బానోత్ కొండ, బందం శ్రీనివాసరావు, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా బందోబస్తు

సమీక్షలో డీఐజీ రంగనాథ్



సభావేదిక వద్ద సూచనలు చేస్తున్న డీఐజీ రంగనాథ్

రఘునాథపాలెం/ఖమ్మంక్రైం: రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంలోని నూతన కలెక్టరేట్ కార్యాలయాల సముదాయం ప్రారంభంతోపాటు, బీఆర్ఎస్ సభకు సీఎం కేసీఆర్‌తో పాటు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు హాజరవుతున్నందున బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని డీఐజీ ఏ.వీ.రంగనాథ్ ఆదేశించారు. రెండు రోజులుగా జిల్లాలో మకాం వేసిన ఆయన శుక్రవారం సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి నూతన కలెక్టరేట్, బీఆర్ఎస్ సభా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రూట్ మ్యాప్, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ట్రాఫిక్ సమస్య, పార్కింగ్ అంతరాయం ఎదురుకాకుండా చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. అడిషనల్ డీసీపీలు శబరీష్, సుభాష్‌చంద్రబోస్ తదితరులు ఉన్నారు.

‘పల్లె’ వైద్యులకు కౌన్సెలింగ్



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న డీఎంహెచ్‌ఓ, జెడ్పీ సీఈఓ

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని పల్లె దవాఖానాల్లో వైద్యులకు పోస్టింగ్ ఇవ్వడంపై అధికారులు దృష్టి సారించారు. పల్లె దవాఖానాల్లో 69మంది వైద్యులను నియమించేందుకు ఇచ్చిన నోటిఫికేషన్‌తో 224మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, జెడ్పీ సీఈఓ అప్పారావు పాల్గొని అభ్యర్థుల ధృవపత్రాలను పరిశీలించారు. మొత్తంగా హాజరైన నలుగురు ఎంబీబీఎస్ అర్హత ఉన్న వారితో పాటు 21 మంది బీఏఎంఎస్ అభ్యర్థులు, బీఎస్సీ నర్సింగ్ చేసి 170మంది ఇంటర్వ్యూ చేసి, మరో 19 మందిని అనర్హులుగా తేల్చారు. వీరితో మెరిట్ జాబితా త్వరలోనే వెల్లడించనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు.

మదన్‌లాల్ బావ.. చంద్రావతి ఆడబిడ్డ!

వైరా ఎమ్మెల్యే రాములునాయక్



వేదికపై రాములునాయక్, చంద్రావతి, మదన్‌లాల్

వైరా: గత ఎన్నికల సమయం నుంచి ఎక్కడా వేదికను పంచుకోని వైరా మాజీ ఎమ్మెల్యేలు బానోతు మదన్‌లాల్, బానోతు చంద్రావతితో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ శుక్రవారం పక్కపక్కనే కూర్చున్నారు. బీఆర్ఎస్ సభ సన్నాహక సమావేశం శుక్రవారం వైరాలో జరగగా మంత్రి హరీశ్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సభకు మాజీలు ఇద్దరు, ప్రస్తుత ఎమ్మెల్యే హాజరవడంతో పాటు పక్కపక్కనే కూర్చోవడం విశేషం. ఈసమావేశంలో రాములునాయక్ మాట్లాడుతూ ‘మదన్‌లాల్ నా బావ... బావ అంటే ఒప్పుకుంటవా లేదా... ఒప్పుకోకపోతే ఫైన్ వేస్తా... మీ ఇంటి ఆడపిల్లనే కదా నాకు ఇచ్చింది’ అని అనడంతో మంత్రి హరీశ్‌రావు సహా అంతా నవ్వుకున్నారు. అంతేకాక చంద్రావతి తన ఆడబిడ్డ అని పేర్కొనడం... మదన్‌లాల్‌తో కలిసి పనిచేస్తానని చెప్పడం గమనార్హం. అయితే, మదన్‌లాల్, చంద్రావతి మాత్రం కొంత ఎడముఖం, పెడముఖంగానే కనిపించారు.

జాతీయస్థాయిలో గిరిజన విద్యార్థి ప్రతిభ



అశ్విని

కారేపల్లి : వ్యవసాయ రంగంలో జాతీయస్థాయి శాస్త్రవేత్తల ఎంపికలో కారేపల్లి మండలం గంగారాం తండాకు చెందిన నూనావత్ అశ్విని ప్రతిభ కనబరిచింది. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఏజీబీఎస్సీ పూర్తిచేసి ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్న అశ్విని జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో శాస్త్రవేత్తగా ఎంపికై జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. మారుమూల గిరిజన తండాకు చెందిన నూనావత్ మోతీలాల్ – నేజీ దంపతులు వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె అశ్విని చిన్నప్పటి నుండి చదువులో ముందు నిలుస్తూ వ్యవసాయరంగంపై మక్కువ ఉండడంతో అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయస్థాయి శాస్త్రవేత్తగా ఎంపిక కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కులం పేరుతో దూషించిన బిల్డర్లపై కేసు

ఖమ్మంరూరల్: ఇల్లు నిర్మిస్తామని చెప్పి కొంత డబ్బు తీసుకున్నాక, ఇబ్బంది పెట్టడమే కాక కులం పేరుతో దూషించిన బిల్డర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని పెదతండా శివారు సాయిప్రభాత్‌నగర్‌కు చెందిన ధర్మసోత్ దీప ఇంటి నిర్మాణం కోసం ఖమ్మంకు చెందిన బిల్డర్లు అజీజ్, మూర్తాల వెంకటనారాయణరెడ్డితో రూ.52లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. కొంత డబ్బు చెల్లించాక లోన్ రావడం ఆలస్యం కావడంతో ఇతర మార్గాల్లో డబ్బు చెల్లించారు. అయినప్పటికీ అగ్రిమెంట్ రద్దయిందని చెప్పడమే కాక పద్మను వెంకట్‌రెడ్డి కులం పేరుతో దూషించాడు. దీంతో ఆమె మనస్తాపంతో పురుగుల మందు తాగగా భర్త ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం బాధితుల ఫిర్యాదుతో బిల్డర్లపై శుక్రవారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

ఎక్సైజ్ ఎస్సైని దూషించిన ముగ్గురిపై కేసు

కారేపల్లి : కారేపల్లి ఎక్సైజ్ ఎస్సై వసంతలక్ష్మి విధులకు ఆటంకం కలిగించి, దూషించిన ముగ్గురిపై కారేపల్లి పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని కొత్తతండాలో భూక్యా కాంతి సారా అమ్ముతోందనే సమాచారంతో ఎక్సైజ్ ఎస్సై వసంతలక్ష్మి తనిఖీకి వెళ్లారు. ఈక్రమంలో భూక్యా రఘుతో పాటు మరో ఇద్దరు ఆమె విధులను ఆటంకపరిచి దూషించారు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

రైలు కింద పడి 19 గొర్రెలు మృతి



చింతకాని: చింతకాని రైల్వేస్టేషన్ సమీపాన 19 గొర్రెలు ప్రమాదవశాత్తు రైలు కింద పడి శుక్రవారం మృతి చెందాయి. బాధితులు వడ్డేపల్లి వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. దళిత బంధు పథకం ద్వారా మంజూరైన గొర్రెలను మేపేందుకు రోజుమాదిరిగానే అడవికి తీసుకెళ్తుండగా రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ఉన్న నీటి గుంట వద్దకు జీవాలు ఆగాయి. అదే సమయాన విజయవాడ వైపు నుంచి ఖమ్మం వైపు గూడ్స్ రైలు వస్తుండడంతో శబ్దానికి బెదిరిన 19 గొర్రెలు పట్టాలపైకి వెళ్లడంతో రైలు ఢీకొని చనిపోయాయి.

విద్యుత్ మోటార్లు చోరీ

నేలకొండపల్లి: మండలంలో తరచుగా జరుగుతున్న విద్యుత్ మోటార్ల చోరీలతో రైతులకు కంటి మీద కునుకు ఉండడం లేదు. కొరట్లగూడెంకు చెందిన రైతులు గుండా సురేష్, తాటికొండ కన్నయ్యకు చెందిన వ్యవసాయ మోటార్లను గురువారం రాత్రి చోరీ అయ్యాయి. వరుస చోరీలతో చెరుకు, మొక్కజొన్న పంటలు ఎండిపోయే పరిస్థితి ఉన్నందున, చోరీలు అరికట్టడంపై పోలీసులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

సర్దేస్తున్నారు !



ఫైళ్లను మూట కడుతున్న ఉద్యోగులు

ఖమ్మం మయూరిసెంటర్ : నూతన కలెక్టరేట్ ప్రారంభ తేదీ సమీపిస్తుండడంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో ఫైళ్లను ఉద్యోగులు సర్దుతున్నారు. ఏ క్షణమైనా కొత్త కలెక్టరేట్‌కు తరలివెళ్లాల్సి ఉంటుందని ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు అందగా, శుక్రవారం ఫైళ్లు, ఇతర సామగ్రి మూటలు కట్టారు.

సిటీ బస్టాండ్.. ఒకేరోజు !



బస్సులు లేక వేచి ఉన్న ప్రయాణికులు (ఇన్‌సెట్) మూసేసిన సిటీ బస్టాండ్ గేట్

ఆర్టీసీ పాత బస్టాండ్‌ను సిటీ బస్టాండ్‌గా తీర్చిదిద్దగా రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈక్రమంలో సిటీ బస్సులు పాత బస్టాండ్ నుంచి వచ్చివెళ్లేలా చూస్తామని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. కానీ మరుసటి రోజైన శుక్రవారమే సిటీ సర్వీసు బస్సులు లేవని పాత బస్టాండ్ గేట్లు మూసేశారు. దీంతో ఇక్కడకు బస్సులు వస్తాయనే ఆశతో వచ్చిన ప్రయాణికులు సమాధానం చెప్పే వారెవరూ లేక వేచి ఉండడం కనిపించింది.

– ఖమ్మం మయూరిసెంటర్

చీటింగ్ కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇల్లు స్వాధీనం చేసుకున్నాడని అందిన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. నగరంలోని బల్లేపల్లిలో నివాసముంటూ మెప్మా ఏఓలో పనిచేసే పి.శ్రీదేవి 200 గజాల్లోని ఇంటిని వి.నాగేశ్వరరావుకు రూ.58 లక్షలకు విక్రయించేందుకు ఒప్పందం కుదిరింది. అయితే, మొత్తం డబ్బు చెల్లించకపోగా, ఇంటిని స్వాధీనం చేసుకొని కోర్టు నుండి తనకు నోటీసులు పంపాడని శ్రీదేవి వెల్లడించారు. తన సంతకం ఫోర్జరీ చేసి నకిలీ అగ్రిమెంట్ సృష్టించడని ఫిర్యాదు చేయడంతో ఆయనపై కేసు నమోదు చేశారు.